క్లుప్తంగా

రేపు రావూరులో నాటకాల ప్రదర్శన

ఇందుకూరుపేట: డాక్టర్ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని రావూరులో శనివారం నాటకాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కొండలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొప్ప కళాకారులతో బాలనాగమ్మ, గయోపాఖ్యానం, శ్రీరామాంజనేయ యుద్ధం తదితర నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కళాభిమానులు ఈ నాటకాలను తిలకించాలని కోరారు.

ఎన్‌ఆర్‌ఐ విభాగం సింగపూర్ కన్వీనర్‌గా దువ్వూరు


దువ్వూరు మురళీకృష్ణారెడ్డి

వెంకటాచలం: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఆర్‌ఐ విభాగం కంట్రీ కన్వీనర్లు, అడ్వైజరీ ప్యానల్‌లను నియమించారు. ఈ మేరకు ఎన్‌ఆర్‌ఐ విభాగం సింగపూర్ కన్వీనర్‌గా సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలం వెంకటరెడ్డిపాళెం గ్రామానికి చెందిన దువ్వూరు మురళీకృష్ణారెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఎన్‌ఆర్‌ఐ విభాగం అడ్వైజర్ మేడపాటి వెంకట్, సింగపూర్‌లో తనకు సహాయ సహకారాలు అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

గొలగమూడిలో మంత్రి కాకాణి పూజలు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో వెలసిన భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. మంత్రికి ఆశ్రమ ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆశ్రమ వైద్యశాలలను మంత్రి సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న ఉచిత వైద్యసేవల గురించి ఈఓ ద్వారా తెలుసుకున్నారు.

విద్యాసామగ్రి వితరణ



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆ పాఠశాల హెచ్‌ఎం పత్తిపాటి నరహరి గురువారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన జామెంట్రీ బాక్కులు, నోట్సులు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు తదితర సామగ్రిని అందజేశారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎస్‌కే ఇలియాజ్, సీఆర్‌పీ ఎం.దయాకర్ పాల్గొన్నారు.

చిన్నారిపై వృద్ధుడి అత్యాచారయత్నం

కోవూరు: అభంశుభం తెలియని ఓ ఎనిమిదేళ్ల చిన్నారిపై 60 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధుడు అత్యాచారయత్నానికి ప్రయత్నించిన ఘటన మండలంలోని పాటూరు కొత్తకాలనీలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తకాలనీలో నివాసం ఉంటున్న 60 సంవత్సరాలపైబడిన వృద్ధుడు మీరామొహిద్దీన్ ఎనిమిదేళ్ల చిన్నారికి మాయమాటలు చెప్పి సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడు. చిన్నారి భయాందోళనతో కేకలు వేయగా మీరామొహిద్దీన్ పరారయ్యేందుకు ప్రయత్నించాడు. కాగా చిన్నారి కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. కోపోద్రిక్తులైన చిన్నారి బంధువులు మీరామొహిద్దీన్ ఇంటిపై దాడి చేశారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పాత జిల్లా పోలీస్ కార్యాలయ పక్క వీధిలో నివాసం ఉంటున్న శోభన్‌బాబు, విజయకుమారి దంపతులు కామాటివీధిలో పిండి వంటల విక్రయ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. వీరి కుమారుడు రాకేష్ వర్ధన్ (20) ఇంజినీరింగ్ మూడో సంవత్సరం వరకు చదువుకొని వ్యాపారంలో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. శోభన్‌బాబు, విజయకుమారి షాపునకు వెళ్లగా, పాఠశాలకు కుమార్తె వెళ్లింది. ఈ క్రమంలో తల్లికి రాకేష్ వర్ధన్ ఫోన్ చేసి టిఫిన్ తీసుకురావాలని కోరడంతో ఆమె ఇంటికెళ్లారు. తలుపులు తెరిచి ఉండటంతో లోపలికెళ్లిచూడగా, హాల్లోని సీలింగ్ ఫ్యాన్‌కు కుమారుడు ఉరేసుకొని వేలాడుతూ కనిపించారు. చికిత్స నిమిత్తం నగరంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు మృతుడి తండ్రి శోభన్‌బాబు ఫిర్యాదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

• ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పత్రాలు



ఈమె పేరు యల్లంపల్లి సుమతి. పొదలకూరు మండలం కనుపర్తి గిరిజనకాలనీకు చెందిన మహిళ. గురువారం ఆ గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో తనకు అవసరమైన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా ఆమె అందుకున్నారు. 'నేరుగా వలంటీర్, సచివాలయ ఉద్యోగులే మా ఇంటికి వచ్చి నా వద్ద వివరాలు తీసుకుని రూపాయి ఖర్చు లేకుండా నాకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేశారని ఈ సందర్భంగా ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

• ఎంతో మేలు జరుగుతోంది



ఈ పెద్దాయన పేరు పొల్లూరు నారాయణ. పొదలకూరు మండలం కనుపర్తి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ. తనకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో నారాయణకు తెలియదు. ఈ క్రమంలో 'జగనన్న సురక్ష'లో కార్యక్రమంలో భాగంగా వలంటీర్, సచివాలయ ఉద్యోగులు నారాయణ ఇంటికే వెళ్లి అతనికి అవసరమైన ధ్రువీకరణ పత్రాల వివరాలు తెలుసుకుని గురువారం అదే గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష'లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. దీంతో నారాయణ ఆనందానికి అవధులు లేవు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతోందంటూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

• మండల కేంద్రానికి వెళ్లే పనిలేకుండా..



ఈ యువకుడి పేరు తురిమెర్ల రాజశేఖర్. పొదలకూరు మండలం కనుపర్తి గ్రామంలో నివాసం ఉంటున్నారు. కౌలు రైతు సర్టిఫికెట్ కోసం కొంత కాలంగా ప్రయత్నిస్తున్నారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో వెరిఫికేషన్‌కు వెళ్లిన వలంటీర్లు, ఉద్యోగులకు తనకు అవసరమైన కౌలురైతు సర్టిఫికెట్ కోసం వివరాలు అందజేశారు. గురువారం సురక్ష క్యాంపులో అతనికి అధికారులు కౌలు రైతు సర్టిఫికెట్ అందజేశారు. మండల కేంద్రానికి వెళ్లకుండా తన గ్రామంలోనే సర్టిఫికెట్ లభించడంపై రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

సంక్షేమానికి ఎవరూ దూరం కావొద్దు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- 'జగనన్న సురక్ష'లో ధ్రువీకరణ పత్రాల అందజేత


పొదలకూరు: ఆర్‌వైపాళెంలో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కావద్దన్నదే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు దేశానికే తలమానికంగా నిలుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలు మండలం వీరంపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం 'జగనన్న సురక్ష' శిబిరాన్ని మంత్రి కాకాణి ప్రారంభించారు. ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సమగ్రంగా, సంపూర్ణంగా అందజేసేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం దోహదపడుతుందన్నారు. గతంలో ఏవైనా సర్టిఫికెట్లు కావాలంటే ప్రజలు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పాలనను ప్రజల ముంగిటకే తీసుకొచ్చిందని, ప్రజలకు అవసరమైన పత్రాలు ఆయా గ్రామాల్లోనే అందిస్తోందని తెలిపారు. ఆగస్టు నుంచి కొత్త పింఛన్లు అందజేస్తామన్నారు. పొదలకూరు నుంచి సంగం, సోమశిల, మనుబోలును కలిపే ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.13.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి కాకాణి అధికారులకు సూచించారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి పలువురు అర్జీలు అందజేసి వారి సమస్యలను చెప్పుకున్నారు. తనకు పింఛన్ రావడం లేదని ఓ దివ్యాంగుడు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. లింగారెడ్డిపల్లిలో ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులు ఫిర్యాదు చేయగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వసుమతి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శివకృష్ణయ్య, ఈఓపీఆర్డీ ప్రసాద్, సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ సభ్యుడు రాధయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జట్టి సురేందర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుమ్మడి వెంకటసుబ్బయ్య, మన్నెమాల సుధీర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మహేంద్రవర్మ, గుంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకం, భరోసా కలిగించేలా..

పొదలకూరు: రాష్ట్రంలో ప్రజలకు నమ్మకం, భరోసా కలిగించేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలంలోని ఆర్‌వైపాళెం, కనుపర్తి సచివాలయాల్లో గురువారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' శిబిరాల్లో మంత్రి కాకాణి పాల్గొని మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనూ పింఛన్ రూ.2,750 అందజేయడం లేదన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి లబ్ధిదారులకు రూ.3 వేల చొప్పున పింఛన్ నగదు అందజేస్తామన్నారు. 'జగనన్న సురక్ష'లో కొత్తగా రేషన్‌కార్డులు పొందేవారికి ఆగస్టు నుంచి పింఛన్ వర్తింపజేస్తామని తెలిపారు. గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందజేస్తామని, ఇప్పటికే జాబితాలను సిద్ధం చేసి ఆమోదించామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు అవసరమైన పలు ధ్రువీకరణ పత్రాలను మంత్రి కాకాణి చేతులమీదుగా అధికారులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, సర్పంచ్ అట్లా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మెంతెం బాలకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, బూసుపల్లి చిన్నపరెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మనుబోలు: లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

బాబూ జగ్జీవన్‌రామ్‌కు మంత్రి నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని కనుపర్తి సచివాలయం వద్ద రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలను ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలందరికీ మేలు


ఇందుకూరుపేట: సర్టిఫికెట్ అందజేస్తున్న డీపీఓ సుస్మితారెడ్డి

ఇందుకూరుపేట: 'జగనన్న సురక్ష'తో ప్రజలందరికీ మేలు చేకూరుతోందని డీపీఓ సుస్మితారెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నం, మైపాడు గ్రామాల్లో గురువారం జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గంగపట్నంలో తహసీల్దార్ సుబ్బయ్య ఆధ్వర్యంలో, మైపాడులో ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో 584 సర్టిఫికెట్లు, 66 ఆధార్‌లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డీటీ బషీర్, ఈఓపీఆర్డీ వసుంధర, సర్పంచ్ సంగం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బుచ్చిరెడ్డిపాళెంలో 'గడప గడపకు..'

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని 11వ వార్డులో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని, అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రహదారుల నిర్మాణానికి రూ.13.50 కోట్లు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: రహదారుల నిర్మాణం, మరమ్మతులకు రూ.13.50 కోట్లు నిధులు మంజూరైనట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనుపర్తి గ్రామంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి కాకాణి మాట్లాడారు. నిధులు మంజూరైన క్రమంలో త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. పొదలకూరు-సోమశిల రహదారికి రూ.4 కోట్లు, పొదలకూరు-మనుబోలు రహదారికి రూ.3.50 కోట్లు, పొదలకూరు-సంగం క్రాస్‌రోడ్డు నుంచి 10 కి.మీ. వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో గ్రామీణ ప్రాంత రోడ్ల మరమ్మతులకు పంచాయతీరాజ్‌శాఖ నుంచి నిధులు కేటాయించారని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అసైన్మెంట్ రివ్యూ కమిటీ ద్వారా రెండు నెలల్లో పేదల భూములకు పట్టాలు అందజేస్తామని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 3 వేల ఎకరాల భూములను పేదలకు అందజేసేందుకు ఆమోదం పొందామన్నారు. 'జగనన్న సురక్ష' బృహత్తర కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి ఉన్నారు.

సంక్షేమ ఫలాలు అందించే బృహత్తర కార్యక్రమం


కొడవలూరు: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్, డీపీఓ

కొడవలూరు: ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించే బృహత్తర కార్యక్రమం 'జగనన్న సురక్ష' అని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. మండలంలోని యల్లాయపాళెం-1,2 సచివాలయాల్లో గురువారం 'జగనన్న సురక్ష' శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. డీపీఓ సుస్మితారెడ్డి మాట్లాడుతూ సర్వే సమయంలో ఇంటి వద్ద లేని వారికి సైతం క్యాంప్ డే రోజున స్పాట్‌లోనే అవసరమైన సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ డీపీఓ సౌజన్య, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమాదేవి, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కె.వెంకటరమణారెడ్డి, సర్పంచ్ కె.కృష్ణమ్మ, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం

బుచ్చిరెడ్డిపాళెం: 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అవకాశం కలిగిందని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు-2 సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షకీలా బేగం, శివకుమార్‌రెడ్డి, నస్రీన్, చాందిని పాల్గొన్నారు.

ముత్తుకూరు మండలంలో..

ముత్తుకూరు: 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వల్లూరు సచివాలయంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ఈ పంచాయతీలో 11 మంది వలంటీర్లు 662 ఇళ్లను సర్వే చేశారు. 922 సమస్యలను పరిష్కరించి ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 82 మంది ఆధార్‌లను ఫోన్ నంబర్ లింక్ చేశారు. సర్పంచ్ పెంచల ప్రతాప్, నాయకుడు పోచారెడ్డి చెంగారెడ్డి, ఈఓపీఆర్డీ హేమంత్‌లు పాల్గొన్నారు. నేలటూరు సచివాలయంలో ఎంపీడీఓ ప్రత్యూష ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం జరిగింది. ఈ పంచాయతీలో 25 మంది వలంటీర్లు 991 ఇళ్లను సర్వే చేశారు. 564 సమస్యలను పరిష్కరించి ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 41 మంది ఆధార్‌లను ఫోన్ నంబర్‌కు లింక్ చేశారు. ఎంపీపీ సుగుణమ్మ, నాయకుడు సీపారెడ్డి రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తోటపల్లిగూడూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హేమలత తెలిపారు. గురువారం తోటపల్లిగూడూరు, పేడూరు గ్రామ సచివాలయాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. తోటపల్లిగూడూరు సచివాలయంలో 640, పేడూరు సచివాలయంలో 279 మందికి వివిధ రకాలైన సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, నాయకులు మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, ఈదూరు రామాచార్యులు, మన్నెం చిరంజీవులుగౌడ్, తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, పాకం ప్రవీణ్, అన్నం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తోటపల్లిగూడూరు: గ్రామసభలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీడీఓ, నాయకులు


ముత్తుకూరు: వల్లూరులో..

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం


విశేషాలంకరణలో శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వస్వామి

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీశ్రీనివాసుని కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ కల్యాణోత్సవ వేడుకకు దుగ్గిశెట్టి సూర్యప్రకాశ్ - శ్వేత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గొడ్డేటి నారాయణరెడ్డి - వెంకటసుబ్బమ్మ దంపతులు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

వేగవంతంగా ఈ-క్రాప్ బుకింగ్

- డీఏఓ సుధాకర్‌రాజు


మాట్లాడుతున్న డీఏఓ సుధాకర్‌రాజు

పొదలకూరు : జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాల్సిందిగా జిల్లా వ్యవసాయాధికారి జి.సుధాకర్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని కనుపర్తి గ్రామ సచివాలయం వద్ద ఆర్బీకే వీఏఏ, వీహెచ్‌ఏలతో పంటల నమోదు పురోగతిపై గురువారం చర్చించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ జిల్లాలో ఎడగారు కింద లక్ష ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు తెలిపారు. మరో లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు ఉన్నట్లు అంచనా ఉందన్నారు. పంటల నమోదు కార్యక్రమాన్ని రెండు రోజుల క్రితం చేపట్టామన్నారు. వీఏఏలు లక్ష్యాల మేరకు పనిచేయాల్సిందిగా సూచించారు. రైతులు పంటల నమోదు చేసుకోకుంటే బీమా సౌకర్యంతో పాటు, ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా పంటలను అమ్ముకునేందుకు అవకాశం ఉండదన్నారు. డీఏఓ వెంట ఏఓ ఏ.వాసు, హెచ్‌ఓ ఈ.ఆనంద్ ఉన్నారు.

పెంపుడు కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి



పొదలకూరు: పెంపుడు కుక్కలు, పశువులతో జాగ్రత్తగా వ్యవహరించాలని పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ సి.మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పశుసంవర్ధకశాఖ వైద్యశాలలో గురువారం ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలు, పశువులు ఉన్న వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ద్వారా మనుషులకు రేబిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ వంటి జబ్బులు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. జాగ్రత్తలు పాటించకుంటే వాటి ద్వారా వచ్చే వ్యాధుల వల్ల ప్రాణహాని ఉందన్నారు. అనంతరం వైద్యశాలలో 25 పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. మండలంలోని తాటిపర్తి పశువైద్యశాల పరిధిలో నల్లపాళెం, తాటిపర్తి గ్రామాల్లో పశువుల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి పశువైద్యశాల సిబ్బంది వివరించారు. వీఏ ఐ.రమేష్‌బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చన పూజలు చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి పోకూరు శేషబ్రహ్మం - ప్రసూనదేవి దంపతులు, వారి కుమార్తె సుహిత ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వివాహిత ఆత్మహత్యకు కారణమైన ఆమె భర్తను చిన్నబజార్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రామకోటయ్యనగర్‌కు చెందిన షబానా (35)కు మన్సూర్‌నగర్‌కు చెందిన సర్తాజ్ అహ్మద్‌తో పెద్దల సమక్షంలో వివాహమైంది. బంగారు పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించే ఆయన కొంతకాలంగా పని మానేసి ఇంట్లో ఖాళీగా ఉంటూ భార్య, పిల్లలను నిత్యం వేధించసాగారు. నీవు చనిపోతే మరో వివాహం చేసుకుంటానంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో షబానా తన తల్లికి ఫోన్ చేసి చెప్పి బాధపడేవారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి తన ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త వేధింపులు తాళలేకే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి మమోలా చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

పోక్సో కేసులో..

నెల్లూరు(క్రైమ్): పోక్సో కేసును నమోదు చేసి గంటలు గడవకముందే నిందితుడ్ని సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన సమీపంలో తన ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అదే ప్రాంతానికి చెందిన శ్రీహరి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి పెద్దగా కేకలేయడంతో అక్కడి నుంచి శ్రీహరి పరారయ్యాడు. విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేసింది. వారు తమ బంధువుల దృష్టికి తీసుకెళ్లి సంతపేట ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ రాజుకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పరారీలో ఉన్న నిందితుడ్ని అరెస్ట్ చేశారు.